సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 14 । ఆగస్టు । 2023



ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అండర్–20 రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. 8లో



వెదజల్లే పద్ధతి మేలు

రైతులు వరి సాగులో వెదజల్లు పద్ధతిని అనుసరించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గుతాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 8లో

హోం మంత్రి పతకానికి..

ఏటా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమయంలో ఇచ్చే కేంద్ర హోం మంత్రి పతకానికి జంగారెడ్డిగూడెం డీఎస్పీ ఎం. ధనుంజయుడు ఎంపికయ్యారు. 8లో



న్యూస్‌రీల్

ఏఎస్ఎన్ఎం కళాశాలకు నాక్ బీ ప్లస్ గ్రేడ్



పాలకొల్లు సెంట్రల్ : స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి (ఏఎస్ఎన్ఎం) ప్రభుత్వ డిగ్రీ కళాశాల నాక్‌లో బీ ప్లస్ గ్రేడ్ సాధించినట్లు ఆదివారం ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. 2017లో కళాశాల బీ గ్రేడ్‌లో ఉండగా ప్రస్తుతం కళాశాల పనితీరు, వసతుల కల్పన, అత్యుత్తమ విద్యాబోధనలతో బీ ప్లస్ గ్రేడ్ సాధించిందన్నారు. 55 ఏళ్ల చరిత్ర గల కళాశాలకు బీ ప్లస్ గ్రేడ్ రావడం శుభపరిణామమన్నారు. కళాశాలలో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో వసతులు, వర్చువల్ క్లాస్ రూమ్‌లు, సీసీ కెమెరాలతో ల్యాబ్స్, లైబ్రరీలు, అత్యుత్తమ ఫ్యాకల్టీలు ఉండగా ఇటీవల నాక్ బృందం కళాశాలను పరిశీలించిందన్నారు. ఈ మేరకు శనివారం నాక్ అధికారులు తమ కళాశాలకు ఈ గ్రేడ్‌ను ప్రకటించారన్నారు. గ్రేడ్ సాధనలో అధ్యాపకులు, సిబ్బంది, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యుల సహకారం ఉందన్నారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దాడిశెట్టి రాజా సోమవారం జిల్లాకు రానున్నట్లు సమాచార శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. సోమవారం సాయంత్రం 5 గంటలకు తుని నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి రాత్రి 8.30 గంటలకు భీమవరం చేరుకుని రాత్రి ఇక్కడ బస చేస్తారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి స్థానిక కలెక్టరేట్ ఆవరణలో జరిగే స్వాతంత్ర దినోత్సవాల్లో పాల్గొంటారు. అదే రోజు మధ్యాహ్నం ఇక్కడ నుంచి తుని బయలుదేరి వెళతారు.

21 వరకు ఓటర్ల జాబితా సవరణకు అవకాశం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఈనెల 21తో ఓటర్ల జాబితా సవరణ అవకాశం ముగియనుందని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. బూత్‌స్థాయి అధికారుల వద్ద ఓటరు జాబితాలో పేరు, చిరునామా వివరాలను చెక్ చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్: ఒంగోలులో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా హ్యాండ్‌బాల్ పురుషుల జట్టును ఎంపిక చేశామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.లక్ష్మీనారాయణ, కార్యదర్శి కె.అలివేలు ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరులోని సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్ ఆవరణలో చేపట్టిన సెలెక్షన్స్‌కు 30 మంది క్రీడాకారులు హాజరయ్యాయని పేర్కొన్నారు. ప్రతిభ చాటిన 16 మంది క్రీడాకారులను జట్టుకు ఎంపిక చేశామని తెలిపారు. జట్టులో కె.సాయికిరణ్, డి.ప్రశాంత్, కె.రాకేష్, కె.చందు, కె.ప్రభుదేవ, ఎ.సాయిరాం, జి.పవన్‌కుమార్, కె.భానుప్రసాద్, బి.మనోజ్ సాయి, జె.ప్రవీణ్‌కుమార్, రాజ్‌కుమార్, ఎన్.హనుమాన్ సత్యసుభాష్, కె. సాయికృష్ణ, కె.లోహిత్, జి.జితేంద్ర, ఆర్.సందీప్‌కుమార్ స్థానం సంపాదించారని పేర్కొన్నారు. ఈనెల 18 నుంచి 20 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని, కోచ్‌గా పి.ఉదయ్ కిరణ్ వ్యవహరిస్తారని వివరించారు.

ఇరిగేషన్ డీఈ ప్రసాద్ అనుమానాస్పద మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇరిగేషన్ డీఈ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలోని గొల్లపూడిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గొల్లపూడి వన్ సెంటర్‌కు చెందిన జె.ప్రసాద్ ఏలూరులో ఇరిగేషన్ శాఖలో డీఈగా పని చేస్తున్నారు. ఆయన కుమారులు అఖిల్, చక్రవర్తి ఇంజినీరింగ్ పూర్తి చేశారు. చిన్న కుమారుడు చక్రవర్తి అమెరికాలో జాబ్ చేస్తున్నాడు. ప్రసాద్ రోజూ ఏలూరు డ్యూటీకి వెళ్లి వస్తుంటారు. కొద్దిరోజుల క్రితం ఆయనకు హార్ట్, యూరినరీ ట్రాక్ సర్జరీలు జరిగాయి. తండ్రి అనారోగ్యంతో బాధపడుతుండటంతో చక్రవర్తి అమెరికా నుంచి తిరిగి వచ్చి తండ్రి వద్దనే ఉంటున్నాడు. ప్రసాద్ తన ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబసభ్యులకు చెప్పి బాధపడుతూ ఉండేవాడు. శనివారం రాత్రి కుటుంబ సభ్యులు అంతా కలిసి భోజనం చేసి నిద్రించారు. ఆదివారం వేకువజామున మూడు గంటల సమయంలో భార్య స్వర్ణలత, కుమారుడు నిద్ర లేచి చూడగా ప్రసాద్ కనిపించలేదు. స్వర్ణలత మెట్లు దిగొచ్చి చూడగా ప్రసాద్ రక్తపు మడుగులో పడి చనిపోయి ఉన్నాడు. స్వర్ణలత ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆక్వా.. ల్యాబ్‌లు వహ్వా

మత్స్య, ఆక్వా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. చేపలు, రొయ్యల సాగులో రైతులకు సలహాలు, వ్యాధుల నిర్ధారణ, నీటి, మట్టి పరీక్షలకు ప్రభుత్వ ఆక్వా ల్యాబ్‌ల ద్వారా సేవలందిస్తోంది. రాష్ట్రంలో సింహభాగం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆక్వాసాగు ఉండగా ఇక్కడ వేలాది కుటుంబాలు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రభుత్వం పలు నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ ఆక్వా ల్యాబ్స్‌ను అందుబాటులో తీసుకువచ్చింది.

రైతు సేవలో ఆక్వా ల్యాబ్‌లు

- తక్కువ ధరలకే పలు రకాల పరీక్షలు
- రూ.1.60 కోట్లతో ఆధునికీకరణ
- అందుబాటులో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు
- సత్ఫలితాలనిస్తున్న ఆక్వాకల్చర్ అథారిటీ

కైకలూరు: ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో చేపలు, 1.20 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. రెండు జిల్లాల నుంచి సుమారు రోజుకు 200 లారీలు ఇతర రాష్ట్రాలకు ఆక్వా ఉత్పత్తుల రవాణా జరుగుతోంది. దేశస్థాయిలో ఆంధ్రప్రదేశ్ ఆక్వారంగ ఉత్పత్తులలో ముందుంది. నాణ్యమైన చేపల, రొయ్యల మేత కోసం నకిలీలకు అడ్డకట్ట వేయడానికి దేశంలోనే మొదటిసారిగా ఫిష్ ఫీడ్ ఆర్డినెన్స్, చేపల, రొయ్యల పిల్లల సరఫరాకు ఆక్వాకల్చర్ సీడ్ క్వాలిటీ కంట్రోల్ ఆర్డినెన్స్‌లను ప్రభుత్వం తీసుకువచ్చింది. ముఖ్యంగా ఆక్వాకల్చర్ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు.

రైతులకు అందుబాటులో..

రాష్ట్రంలో మంచినీటి సంవర్ధన రిఫరల్ లాబోరేటరీ కైకలూరులో ఉంది. ఏలూరులో మత్స్యశాఖ డాక్టర్ వైఎస్సార్ ఆక్వాకల్చర్ ప్రయోగశాల అందుబాటులో ఉంది. ల్యాబ్ అవసరాల రీత్యా ప్రభుత్వం ఒక్కో ల్యాబ్‌కు రూ.80 లక్షలు కేటాయించి పూర్తిస్థాయిలో ఆధునికీకరించింది. అలాగే భీమడోలులో ఇంటిగ్రేటెడ్ ఆక్వా ల్యాబ్, పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలో రీజినల్ ఆక్వా ల్యాబ్, ఏఎంసీ ఇంటిగ్రేటెడ్ ఆక్వా ల్యాబ్‌లు సేవలందిస్తున్నాయి. మార్టేరులో మరో ల్యాబ్ నిర్మాణంలో ఉంది. ఆకివీడులో రీజినల్ ఆక్వా ల్యాబ్ అందుబాటులో ఉంది. అలాగే నర్సాయిపాలెం, పాలకొల్లులో ఆక్వాల్యాబ్స్ అందుబాటులోకి రానున్నాయి. ల్యాబ్‌లో వివిధ పరీక్షల రుసుం కూడా తక్కువే. ఉదాహరణకు పీసీఆర్ పరీక్ష కైకలూరు ల్యాబ్‌లో రూ.800కు చేస్తుండగా ప్రైవేట్ ల్యాబ్‌లలో రూ.1,600 వరకు తీసుకుంటున్నారు. అలాగే కొన్ని పరీక్షలు ప్రభుత్వ ల్యాబ్‌లలో ఉచితంగా అందుబాటులో ఉన్నాయి.



కైకలూరులో రాష్ట్రస్థాయి రిఫరల్ ల్యాబొరేటరీ



ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అప్సడా చట్టంతో దోపిడీకి అడ్డుకట్ట

ఆక్వా రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని పుట్టగొడుగుల్లా పుట్టుకువచ్చిన ప్రైవేటు ఆక్వా ల్యాబ్‌లు అందినకాడికి దోచుకోవడాన్ని అప్సడా చట్టం ద్వారా ప్రభుత్వం నిరోధించే చర్యలు తీసుకుంది. ప్రతి ఆక్వా ల్యాబ్ కచ్చితంగా లైసెన్సులు పొందాలని నిబంధన విధించింది. అలాగే ఆక్వా మందుల దుకాణాల్లో నిషేధిత మందులపై అధికారులు తనిఖీలు చేస్తున్నారు. అనుమానం కలిగిన మేతలను పరీక్షిస్తున్నారు. దీంతో ఆక్వా దుకాణాలు, ప్రైవేటు ల్యాబ్‌లలో జవాబుదారీతనం పెరిగింది. ముఖ్యంగా మత్స్య ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి రూ.225 కోట్ల వ్యయంతో అవసరమైన నియోజకవర్గాల్లో ఆక్వా హబ్ నిర్మాణాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జరిగాయి.

ఆక్వా ల్యాబ్‌ల్లో టెస్టులు

ల్యాబ్	పరీక్షలు
ఏలూరు	9,475
కైకలూరు	10,036
భీమడోలు	4,346
భీమవరం రీజినల్	5,213
ఆకివీడు	2,867
భీమవరం ఏఎంసీ	161

ఆక్వా ల్యాబ్‌ల్లో సేవలు

మైక్రో బయోలజీ, హిస్టో పాథాలజీ సేవలు టోటల్ ప్లేట్ కౌంట్, సూడో మోనాస్, ఎయిరో మోనాస్, టోటల్ విబ్రియో కౌంట్, ఫంగల్, ల్యూమిని సెంట్ టెస్టులు ఒక్కో టెస్టుకు రూ.100, డ్రగ్ సెన్సిటీవిటీ పరీక్షకు రూ.400, బయోకెమికల్ టెస్టుకు రూ.500, హిస్టోలజీ స్లైడ్ పరీక్షను రూ.300కు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ప్రభుత్వ ల్యాబ్‌లలో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించారు. వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌లలో ఫిషరీస్‌ను అనుసంధానం చేసి సేవలు అందిస్తున్నారు. కైకలూరు, ఏలూరు ప్రభుత్వ ల్యాబ్‌లలో రూ.లక్షల విలువైన అధునాతన ల్యాబ్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఆక్వా రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
– బి.రాజ్‌కుమార్, ఆక్వాల్యాబ్, ఏడీ, ఏలూరు

నీటి పరీక్షలు

ఉష్ణోగ్రత, పీహెచ్, క్షారగుణం, కఠినత్వం, ఆక్సిజన్ డిసాల్వర్, సోలిడ్స్, కార్బన్ డైఆక్సైడ్ కలిపి పరీక్షకు రూ.100, అమ్మోనియా టెస్టుకు రూ.100, ఐరన్, నైట్రేట్ ఒక్కో టెస్టుకు రూ.50, నైట్రైట్ పరీక్షకు రూ.90, క్లోరిన్ పరీక్షకు రూ.70, ఫాస్ఫేట్ పరీక్షకు రూ.70.

మట్టి పరీక్షలు

నైట్రోజన్ పరీక్షకు రూ.100, ఆర్గానిక్ కార్బన్ టెస్టుకు రూ.60, ఫాస్పరస్ పరీక్షకు రూ.50, మట్టి పీహెచ్ ఉచితంగా చేస్తారు.

మేత విశ్లేషణ

కొవ్వులు, పీచు టెస్ట్ ఒక్కొక్కటి రూ.180, ప్రొటీన్ పరీక్షకు రూ.200, బూడిద, తేమ పరీక్షకు ఒక్కొక్కటి రూ.60 చొప్పున తీసుకుంటారు.

ఆర్టీ, పీసీఆర్ టెస్టులు

డబ్ల్యూఎస్ఎస్‌వీ, ఐహెచ్‌హెచ్ఎన్‌వీ, ఈహెచ్‌పీ టెస్టులు ఒక్కొక్కటి రూ.800, విబ్రో స్పిషియస్ పరీక్షకు రూ.1,200. వీటితో పాటు మరిన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

ఉపాధ్యాయులకు 'లయన్స్' పురస్కారాలు

జంగారెడ్డిగూడెం: ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేయనున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టి మాణిక్యాలరావు తెలిపారు. ఆదివారం స్థానిక సీజీఆర్ టౌన్ హాల్‌లో అవార్డుల ఎంపిక నిమిత్తం రూపొందించిన మార్గదర్శకాల సర్క్యులర్ బ్రోచర్లను ఆవిష్కరించారు. వేడుకలకు జిల్లా చైర్‌పర్సన్‌గా పంతగాని వెంకన్నను నియమించారు. అవార్డులకు ఎంపికయ్యే ఉపాధ్యాయులు కనీసం పదేళ్ల సర్వీసు పూర్తిచేసి ఉండాలని వెంకన్న అన్నారు. జిల్లాలోని లయన్స్ క్లబ్బుల ద్వారా ఉపాధ్యాయులు తమ వివరాలు పంపాలని సూచించారు. ఉపాధ్యాయులు తమ సర్వీసు కాలంలో చేసిన సేవా కార్యక్రమాలు ప్రత్యేక కమిటీకి అందజేయాలన్నారు. జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్‌కు జిల్లా డైరెక్టరీలను గవర్నర్ మాణిక్యాలరావు అందజేశారు. ఎంపిక కమిటీ కన్వీనర్‌గా బీవీ రమణమూర్తి, సభ్యులుగా ఎ.సర్వేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, బరజాపు రంగారావు, సీహెచ్ పావని వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వీస్ కో–ఆర్డినేటర్ సీహెచ్ అవినాష్ రాజు, రీజనల్ చైర్‌పర్సన్ మల్లికార్జునరావు, మద్దుకూరి శ్రీహరి, జోన్ చైర్‌పర్సన్ కృష్ణంరాజు, జంగారెడ్డిగూడెం క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు హనుమంతరావు, కొండపల్లి పండు, నాయకులు పాల్గొన్నారు.



మార్గదర్శకాల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మానసిక ప్రశాంతతకు కళలు దోహదం

ఆకివీడు: సంస్కృతి, సంప్రదాయాలను ఇనుమడింపజేయడంతో పాటు మానసిక ప్రశాంతతకు కళలు దోహదపడతాయని శారదా కళా సమితి అధ్యక్షుడు డాక్టర్ ఎంపీ సూర్యనారాయణరాజు అన్నారు. కళా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో విశాఖ డ్యాన్స్ అకాడమీచే భరత నాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతీయ కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. త్యాగరాజు, అన్నమయ్య, గోవిందనామ కీర్తనలతో భరత నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అకాడమీ ప్రతినిధులు లక్ష్మీ మహంతి, శంకర్ మహంతి, కళాసమితి కార్యదర్శి కేఆర్‌కే మూర్తిరాజు, కోశాధికారి ఏఎస్ఎన్ రాజు, వానపల్లి బాబూరావు, గుర్రం శ్రీనివాసరావు, సన్నిధి రామవెంకటేశ్వరరావు, సాగిరాజు సూర్యనారాయణరాజు, బొబ్బిలి బంగారయ్య పాల్గొన్నారు.



విశాఖ కళాకారుల భరత నాట్య ప్రదర్శన

ట్రాక్టర్ ఢీకొని ఆటో బోల్తా

ఎనిమిది మందికి గాయాలు

నూజివీడు: మండలంలోని బోర్వంచ వద్ద ఆదివారం రాత్రి ఆటో–ట్రాక్టర్ ఢీకొనడంతో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. కొత్తరావిచర్లకు చెందిన మహిళలు ప్రార్థన నిమిత్తం రాత్రి 7.45 గంటలకు ఆటోలో దేవరగుంట వెళ్తుండగా బోర్వంచ సమీపంలో నూజివీడు నుంచి పాతరావిచర్లకు వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఆటో బోల్తా కొట్టింది. దీంతో కొత్తరావిచర్లకు చెందిన పులపాక రంగమ్మ (58), పులపాక మహాలక్ష్మి (35), పులపాక ప్రియాంక (17), పులపాక మరియమ్మ (47), పులపాక రమణ (30), పులపాక స్వరూపారాణి (45), ముల్లంగి జ్యోతి (40), ఆటో డ్రైవర్ జాలాది సంజీవరావు (35)కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన ఆటోల్లో, 108 వాహనంలో ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. పోలీసులు ఆసుపత్రికి వచ్చి వివరాలు సేకరించారు.

సూపర్ కిడ్స్

జంగారెడ్డిగూడెం: స్థానిక సుబ్బంపేట రోడ్డులోని శ్రీచక్ర సహిత లలిత త్రిపుర సుందరి ఆలయ అర్చకుడు బీవీవీ నాగమందేశ్వరశర్మ మనుమలు సూపర్ టాలెంటెడ్ కిడ్ పురస్కారాన్ని పొందారు. నాగమందేశ్వర శర్మ మనువడు నాగ అనిరుద్ధ (13 నెలలు) విశేష ప్రతిభను చూపిస్తున్నాడు. ఆటబొమ్మలు, ఆటోమొబైల్స్, ఆర్గాన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు, వెహికల్స్‌ను చూసిన వెంటనే గుర్తించి ఔరా అనిపిస్తున్నాడు. మానవ భావోద్వేగాలు, జంతువుల శబ్దాలు, క్రీడలు, ఇంటి వస్తువులు ఇట్టే గుర్తుపడుతున్నాడు. అలాగే మనుమరాలు లక్ష్మీవర్ణిక (16 నెలలు) కూడా ఏడాది వయసులోనే జంతువులు, పండ్లు, ఆర్గాన్స్, ఆర్నమెంట్స్, వాహనాలు, ఫర్నీచర్, ఎలక్ట్రికల్ వస్తువులు, హిందూ సంప్రదాయాలను గుర్తించి భళా అనిపించింది. వీటన్నింటినీ తల్లిదండ్రులు వీడియో రికార్డ్ చేసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు పంపారు. దీంతో చిన్నారులను వారు సూపర్ టాలెంటెడ్ కిడ్‌గా గుర్తించి సర్టిఫికెట్లు పంపారు.



చిన్నారులు నాగ అనిరుద్ధ, లక్ష్మీ వర్ణిక

ఎస్ఏఎస్ కళాశాల అభివృద్ధికి కృషి

ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్

ఉంగుటూరు: శ్రీ అరవింద శత జయంతి (ఎస్ఏఎస్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషిచేస్తానని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఉంగుటూరు మండలం నారాయణపురంలో శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవాలకు ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ విద్యావ్యాప్తికి చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు చేసిన కృషి మరవలేనిదన్నారు. 2009లో మూర్తిరాజును కలిసిన రోజున అసలైన గాంధేయవాదం ఆయనలో చూశానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందని, పేద విద్యార్థులు ప్రపంచ స్థాయిలో ఎదగాలనే ధ్యేయంతో సీఎం జగన్ పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారన్నారు.

మూర్తిరాజు సేవలు ఎనలేనివి

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ మూర్తిరాజు మహనీయుల పేర్లతో ఆ రోజుల్లోనే 72 విద్యాసంస్థలను స్థాపించడం సామాన్య విషయం కాదన్నారు. మూర్తిరాజును అందరూ స్మరించుకోవాలన్నారు. కళాశాల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానన్నారు. అరవిందుని ఆశ్రమం కమిటీ సభ్యుడు చంద్రశేకర్ మాట్లాడుతూ అరవిందుని జీవిత విశేషాలు వివరించారు. అనంతరం పూర్వ గురువులు జి.వెంకటేశ్వరరావు, శ్యామ్‌సూరి, వావిలాల ఝాన్సీ, రామరాజు, బీవీ కృష్ణారెడ్డి, చేకూరి ఝాన్సీ తదితరులను పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు సత్కరించారు. కళాశాల అభివృద్ధికి సహకరించిన కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, ఎమ్మెల్యే వాసుబాబు, ఎంపీ కోటగిరిని పూర్వ విద్యార్థుల సంఘం తరపున సత్కరించారు. పూర్వ విద్యార్థులు తణుకు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ఎన్‌వీఆర్ ప్రభాకరరావు, గన్నవరం సీఐ కనకరావు, బొమ్మిడి అప్పారావు తదితరులు మాట్లాడారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఈపూరి సత్యనారాయణ, ప్రిన్సిపాళ్లు టీకే విశ్వేశ్వరరావు, బి.శ్రీనివాసు, దొంతల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా పూర్వ విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ చేశారు. అరవిందుని విగ్రహాన్ని ఎంపీ కోటగిరి శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు.

80 శాతం ప్రజలు జగన్ వెంటే..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పేద ప్రజలు భుజాన వేసుకున్నారని, 80 శాతం ప్రజలు ఆయన వెంటే ఉన్నారని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పేదల్లో ధైర్యం, ఆత్మస్థైర్యం నింపిందని, ప్రజలంతా ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నారన్నారు. ప్రతిపక్షాల వైపు ఉన్నత వర్గాలు హడావుడి చేసినంత మాత్రాన ఏమీ జరగదన్నారు. రాష్ట్రంలో 175 సీట్లను వైఎస్సార్ సీపీ గెలవడం ఖాయమని, సీఎం జగన్‌పై నమ్మకాన్ని ప్రజలు నిలబెడతారని ధీమా వ్యక్తం చేశారు. ఏలూరు–రాజమండ్రి మార్గంలో ప్యాసింజరు రైలు వేయిస్తానని, అయితే ఆ రైలును ప్యాసింజర్లు ఎక్కి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ప్యాసింజర్లు ఎక్కకపోవడంతో గతంలో నడిచే ప్యాసింజర్ రైలును రద్దు చేశారని, ఇప్పుడు అన్ని గ్రామాల ప్రజలు ప్యాసింజర్ రైలు కావాలని అడుగుతున్నారన్నారు. నెలరోజుల్లో ప్యాసింజర్ రైలును పునరుద్ధరణ చేయిస్తానన్నారు.



ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు

జిల్లాస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు



బాడీబిల్డింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలనీ, తాము ఉన్నత స్థితికి చేరేందుకు మంచి ప్రణాళికలతో కృషి చేయాలని ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్‌వీ మురళీకృష్ణ అన్నారు. ఏలూరు పోలీస్ కల్యాణ మండపంలో మోతే దుర్గారావు స్మారక జిల్లాస్థాయి శరీర సౌష్టవ పోటీలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునేందుకు శక్తివంచన లేకుండా పాటుపడాలని కోరారు. శారీరక దారుఢ్యంతో మానసిక ఉల్లాసం సైతం ఉంటుందనీ, ఉపాధి, ఉద్యోగ అవకాశాల మెరుగుకు ప్రయత్నం చేయాలని సూచించారు. సమాజంలో తమ కుటుంబానికి పేరు తీసుకురావటంతోపాటు వ్యక్తిగతంగా ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

ఎస్ఈబీ హెడ్ కానిస్టేబుల్‌పై మండిపాటు



దొరసానిపాడులో ఎస్ఈబీ హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డిని నిలదీస్తున్న గ్రామస్తులు

సొమ్ములు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణ

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడులో భీమడోలు ఎస్ఈబీ హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డితో ఆదివారం రాత్రి కొందరు గ్రామస్తులు ఘర్షణకు దిగారు. సొమ్ములు ఇవ్వకపోతే సారా కేసు పెడతానంటూ బెదిరిస్తున్నాడని ఆరోపించారు. స్థానికులు, బాధితుడి కథనం ప్రకారం.. దొరసానిపాడుకి చెందిన మట్టా శ్రీను స్థానికంగా పాలకేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. సారా విక్రయిస్తుందంటూ శ్రీను భార్య ధనలక్ష్మిపై గతనెలలో ఎస్ఈబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆ సమయంలో రూ.10 వేలు ఇస్తే విషయాన్ని పై అధికారులకు చెప్పకుండా విడిచిపెడతానని, లేకుంటే జైలుకు పంపుతానని కృష్ణారెడ్డి అన్నాడని శ్రీను, ధనలక్ష్మి అంటున్నారు. అప్పటినుంచి కృష్ణారెడ్డి పలుమార్లు ఫోన్ చేసి సొమ్ములు డిమాండ్ చేస్తున్నాడని, రాత్రి వేళల్లో ఇంటికి వచ్చి తన భార్యతో అసభ్యకరంగా మాట్లాడాడని శ్రీను ఆరోపించాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం తమ ఇంటికొచ్చి రూ.10 వేలు డిమాండ్ చేశాడని, లేకుంటే అరెస్టు చేసి బెయిల్ రాకుండా చేస్తానని, పీడీ యాక్ట్ కూడా పెడతానని బెదిరించాడని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. అదే సమయంలో గ్రామస్తులతో కలిసి శ్రీను హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారెడ్డిపై తిరగబడటంతో అతడు అక్కడి నుంచి జారుకున్నాడు. ఉన్నతాధికారులు విచారణ జరిపి హెడ్ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని శ్రీను దంపతులు, గ్రామస్తులు మిడతా రమేష్, కొనకళ్ల వెంకట్రావు, మిడతా రంగమ్మ, మిడతా పద్మ, పాకనాటి వెంకటేశ్వరరావు, పాకనాటి అబ్బులు తదితరులు కోరుతున్నారు. దీనిపై ఎస్ఈబీ సీఐ ప్రసాద్‌కుమార్ వివరణ ఇస్తూ దొరసానిపాడులో జరిగిన ఘటన తన దృష్టికి వచ్చిందన్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

రాట్నాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

పెదవేగి: రాట్నాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు తరలి వచ్చారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల ద్వారా రూ.44,920, విరాళాలుగా రూ.35,297, లడ్డూ ప్రసాదం విక్రయాల ద్వారా రూ 40,815, ఫొటోల వల్ల రూ.5,940 ఆదాయం లభించగా మొత్తం రూ.1,26,972 ఆదాయం లభించిందని దేవస్థానం చైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతి చెందిన బడిగంట వెంకటేశ్వర్లు

తణుకు: తణుకు మండలం దువ్వ గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. తాడేపల్లిగూడెం మండలం జువ్వలపాలెంకు చెందిన బడిగంట వెంకటేశ్వర్లు (60) ఇరగవరం మండలం పేకేరులోని బంధువుల ఇంట్లో దిన కార్యక్రమానికి వెళ్లి ఆదివారం బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరారు. దువ్వ జాతీయ రహదారిపైకి వచ్చేసరికి ఎదురుగా రాంగ్‌రూట్‌లో బైక్‌పై వచ్చిన గోరంట్ల రాంబాబు అనే వ్యక్తి ఢీకొట్టాడు. ప్రమాదంలో వెంకటేశ్వర్లు సంఘటనా స్థలంలోనే మృతి చెందగా రాంబాబుకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తణుకు రూరల్ ఎస్సై కె.గుర్రయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోం మంత్రి పతకానికి ధనుంజయుడు ఎంపిక

- ఒంగోలులో దిశ డీఎస్పీగా రెండు కేసుల ఛేధనలో విశేష కృషి
- ఇటీవలే జంగారెడ్డిగూడెంకు బదిలీ


కేంద్ర హోంమంత్రి పతకానికి ఎంపికైన జంగారెడ్డిగూడెం డీఎస్పీ ఎం.ధనుంజయుడు

జంగారెడ్డిగూడెం: కేంద్ర హోం శాఖ ఏటా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమయంలో ఇచ్చే కేంద్ర హోం మంత్రి పతకానికి జంగారెడ్డిగూడెం డీఎస్పీ ఎం.ధనుంజయుడు ఎంపికయ్యారు. 2023 సంవత్సరానికి అత్యుత్తమ నేరపరిశోధన చేసిన రాష్ట్రానికి చెందిన ఐదురుగు పోలీసు అధికారులు ఈ పతకానికి ఎంపిక కాగా వారిలో ఒకరు ధనుంజయుడు. నేర పరిశోధనల్లో ఉన్నత ప్రమాణాల్ని ప్రోత్సహించడం కోసం 2018 నుంచి పోలీసు అధికారులకు కేంద్ర హోం శాఖ ఈ పతకాలు అందిస్తోంది. 2020లో ప్రకాశం జిల్లా ఒంగోలులో దిశ డీఎస్పీగా ధనుంజయుడు పని చేస్తున్న సమయంలో రెండు కీలకమైన కేసులను ఛేధించడంలో విశేష కృషిచేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు ఈ పతకం అందిస్తున్నారు.

ఎస్సై నుంచి డీఎస్పీ వరకూ

బాపట్ల జిల్లా చీరాల మండలం చీపురుపాలెం ధనుంజయుడి స్వగ్రామం. చీరాలలో బీఎస్సీ డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. 1991లో ఎస్సైగా డీటీసీలో శిక్షణ పొందారు. గుంటూరు జోన్ నుంచి ఎంపికైన ఈయన నెల్లూరు జిల్లాలో ప్రాక్టికల్ ట్రెనింగ్ పూర్తి చేశారు. నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి తాలూకా సీతారామపురం పోలీస్‌స్టేషన్‌కు ఎస్సైగా నియమితులయ్యారు. ఆ తరువాత ఉదయగిరి, కావలి టూటౌన్, సంగం, ఆత్మకూరు పోలీస్‌స్టేషన్లలో ఎస్సై పనిచేశారు. నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌పై దాడి జరగడంతో ఆ సమయంలో ధనుంజయుడిని అక్కడికి పంపారు. ఆ తరువాతి కాలంలో నెల్లూరు త్రీ టౌన్‌కు బదిలీ అయ్యారు. సీఐగా పదోన్నతి చెంది విజయవాడలో సీఐడీ విభాగంలో ఆరు సంవత్సరాలు పనిచేశారు. అనంతరం మూడేళ్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేశారు. 2014లో డీఎస్పీగా పదోన్నతి పొంది కృష్ణా జిల్లా ఇంటిలిజెన్స్ డీఎస్పీగా ఐదేళ్లు పనిచేశారు. అలాగే విశాఖ ట్రాఫిక్ ఏసీపీగా 10 నెలలు పనిచేశారు.

సాంకేతిక ఆధారాలతో కేసుల నిరూపణలో ప్రతిభ

2020లో ప్రకాశం జిల్లా ఒంగోలు దిశ డీఎస్పీగా రెండేళ్లపాటు పనిచేశారు. ఈ సమయంలోనే రెండు కీలకమైన కేసులు ఛేధించడంలో కీలకంగా పనిచేశారు. గిద్దలూరు మండలం అంబవరంలో ఏడేళ్ల చిన్నారిపై ఒక వ్యక్తి అత్యాచారం చేసి హత్యచేశాడు. ఈ కేసును ధనుంజయుడు చాలెంజింగ్ తీసుకున్నారు. కేసును లోతుగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్షపడేలా సాక్ష్యాధారాలు సమర్పించారు. దీంతో నిందితుడికి గత జనవరిలో కోర్టు ఉరిశిక్ష విధించింది. అలాగే కందుకూరులో 15 ఏళ్ల బాలికను నిర్బంధించి వ్యభిచారం కూపంలోకి నెట్టారు. వారం రోజుల పాటు బాలికపై 25 మంది అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసును కూడా చాలెంజింగ్‌గా తీసుకుని సెల్‌ఫోన్, ఫోన్‌పే ఆధారంగా నిందితులను గుర్తించారు. 25 మంది ఆ వారం రోజుల పాటు వినియోగించిన కండోమ్‌లు డీఎస్పీ స్వాధీనం చేసుకుని డీఎన్ఏ పరీక్షలకు పంపారు. మేజిస్ట్రేట్ సమక్షంలో బాలికతో ఐడెంటిఫికేషన్ పెరేడ్ ఏర్పాటు చేశారు. దీంతో 25 మందిని బాలిక గుర్తించింది. అన్ని ఆధారాలతో ఈ కేసును నిరూపించారు. ఈ కేసును ఛేధించడంలో సాంకేతిక ప్రమాణాలు పాటించారు. ఈ రెండు కేసులు ఛేధించడంలో డీఎస్పీ విజయం సాధించారు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ప్రకాశం జిల్లా ఎస్పీ.. డీజీపీ ద్వారా వీటి వివరాలను కేంద్రానికి పంపారు. నేర పరిశోధనలో అత్యుత్తమ సేవలను గుర్తించిన కేంద్రం ధనుంజయుడిని కేంద్ర హోం మంత్రి పతకానికి ఎంపిక చేసింది. ప్రకాశం జిల్లా నుంచి ఆయన తాడేపల్లి సిట్‌కు డీఎస్పీగా బదిలీ అయ్యారు. అక్కడ కూడా అత్యంత ప్రతిభ కనబర్చి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో రూ.250 కోట్ల దుర్వినియోగాన్ని వెలికి తీశారు. ప్రస్తుతం ఈ కేసు ఇంకా దర్యాప్తులో ఉంది. ఇటీవల బదిలీల్లో భాగంగా మే నెలలో జంగారెడ్డిగూడెం డీఎస్పీగా బదిలీపై వచ్చారు.

15, 16 తేదీల్లో నరసాపురం-హైదరాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు

నరసాపురం: ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ నెల 15, 16 తేదీల్లో నరసాపురం-సికింద్రాబాద్ మధ్య రెండు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు రైల్వే శాఖ భీమవరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు చెప్పారు. 07169 సర్వీస్ నెంబర్‌తో 15వ తేదీ మంగళవారం నరసాపురంలో సాయంత్రం 6 గంటలకు నరసాపురం నుంచి రైలు బయలుదేరి పాలకొల్లు, భీమవరం, ఆకివీడు, గుడివాడ, విజయవాడ మీదుగా మరుసటిరోజు ఉదయం 3.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. మళ్లీ బుధవారం అదే సర్వీస్ నెంబర్‌తో సికింద్రాబాద్‌లో రాత్రి 11.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.35 గంటలకు నరసాపురం చేరుకుంటుంది.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ముసునూరు: అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని ముసునూరు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. బలివేలోని తమ్మిలేరు ఇసుక ర్యాంపు నుంచి ఆదివారం అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేసి తరలిస్తున్న బలివేకు చెందిన వీర్ల శ్రీనును ట్రాక్టర్‌తో సహా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలంటూ రాస్తారోకో


చనుబండ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న బాధితుడి కుటుంబం, దళితులు

చాట్రాయి: దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలంటూ మండలంలోని చనుబండ గ్రామస్తులు ఆదివారం రాస్తారోకో చేశారు. గ్రామానికి చెందిన గొల్లమందల వెంకటేశ్వరావు ఈ నెల 2న తన పొలంలోకి నీళ్లు రానివ్వద్దని పక్కనే ఉన్న గద్దల ఆశీర్వాదానికి విన్నవించాడు. మాట వినకుండా వెంకటేశ్వరావు పొలంలోకి నీళ్లు పెట్టడంతో ఇద్దరి మధ్య తోపులాట జరిగింది. నా తండ్రిని కొడతావా అంటూ ఆశీర్వాదం కొడుకు గద్దల గోపి ఈ నెల 4న వెంకటేశ్వరావుపై కర్రతో దాడి చేశాడు. అదే సమయంలో ఆశీర్వాదం, మరికొందరు వెంకటేశ్వరావుపై దాడి చేశారు. ఈ సంఘటనలో వెంకటేశ్వరావుకి తీవ్ర గాయాలు కావడంతో నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీంతో దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలంటూ బాధితుడి భార్య శ్రీదేవి, కుల పెద్దలు కలిసి చాట్రాయి ఎస్సై స్వామికి విన్నవించారు. నివేదిక రాగానే కేసు నమోదు చేసి అరెస్టు చేస్తానని హామీ ఇచ్చారు. తనకు న్యాయం చేయాలంటూ కులపెద్దలకు బాధితుడి భార్య విన్నవించుకోవడంతో పంచాయతీ పెట్టారు. పంచాయతీకి దాడి చేసి వ్యక్తులు రాకపోవడంతో చనుబండ సెంటర్లో బాధితుడి కుటుంబం, ఎస్సీ వర్గానికి చెందిన కొందరు రాస్తారోకో చేసారు. సమాచారం తెలుసుకున్న నూజివీడు సీఐ అంకబాబు, ముసునూరు ఎస్సై కుటుంబారావు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేయాలని తన కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని బాధితుడి భార్య శ్రీదేవి సీఐకి విన్నవించింది. దీంతో గోపిని అరెస్టు చేసారు. అలాగే మిగతా వారిని తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేస్తానని సీఐ హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

గడపగడపకు సంక్షేమం


జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ మీ అబ్బాయి /అమ్మాయి 5వ తరగతి చదువుతున్నారా నవోదయ ఎంట్రన్స్‌కై ఆన్ - లైన్ లో దరఖాస్తు చేయుటకు చివరి తేది.17-08-2023 నాగార్జున అకాడమి, ఏలూరు సెల్: 92466 62706 [P-1167754]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థ లలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్రః © 99481 66555 [B-1193214]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. © 76508 91999 [B-788203]

Wanted

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K, ఏజెంట్ కమీషన్ 3K ఫోన్: 9848571888 [HA-502]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 12000-35000/- ఫ్రీ రూమ్ + భోజనం. Hyd ఫోన్: 8891753808 [HA-504]

■ MS కంపెనీ నందు ఇంటి నుండి పార్ట్‌టైమ్ /ఫుల్ టైమ్ వర్క్ చేయుటకు టెలికాలర్స్ కావలెను. మేల్/ఫీమేల్, Qly:10th, జీతం: 16,000 -18,000 Ph: 9989923178/ 7075227337 [HA-498]

www.sakshi.com సాక్షి స్పోర్ట్స్

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రాచీన క్రీడలకు ప్రోత్సాహం అభినందనీయం

మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

సాక్షి, భీమవరం: ప్రాచీన క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. భీమవరం పట్టణంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్‌లో పశ్చిమగోదావరి జిల్లా రోప్ స్కిప్పింగ్, మల్లఖంబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 16వ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్, 4వ రాష్ట్రస్థాయి మల్లకంబ్ పోటీలు నిర్వహించారు. 17 జిల్లాల నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు మాట్లాడుతూ ప్రాచీన క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని, ఇలాంటి క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అడిషనల్ ఎస్పీ ఎ.సుబ్బరాజు మాట్లాడుతూ పోల్ మీద యోగాసనాలు చేయడం అత్యంత ప్రాచీన భారతీయ క్రీడ అని, ఆ క్రీడపై ఇప్పటికీ మక్కువ చూపిస్తూ క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు మెడల్స్, మెమెంటోలను వేద సీడ్స్ తరఫున డాక్టర్ పి.చంద్రశేఖర్ అందజేశారు. క్రీడలను విజయవంతంగా నిర్వహించిన పూర్ణ చంద్రశేఖరరాజుని మండలి చైర్మన్ సత్కరించారు. కార్యక్రమంలో డీఈవో వెంకటరమణ, స్కూల్ కరస్పాండెంట్ రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డులో దిగబడిన బస్సు



జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పట్టెన్నపాలెంలో జల్లేరు వాగు డైవర్షన్ రహదారిపై ప్రైవేటు టూరిస్ట్ బస్సు దిగబడి కొంతమేర ఒరిగింది. అయితే బస్సులోని ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. హైదరాబాద్ నుంచి బుట్టాయిగూడెం మండలం గుబ్బల మంగమ్మ తల్లి క్షేత్రానికి బస్సు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు జేసీబీ సహాయంతో బస్సును బయటకు తీసే చర్యలు చేపట్టారు. ఈ రహదారి ఎత్తు పల్లాలుగా ఉండటంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. వాహనాలు బోల్తాపడి ప్రమాదాలు జరిగాయి.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం


రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

సాక్షి, భీమవరం: క్రీడాకారులుగా ఎదిగితే మంచి భవిష్యత్తును అందుకోవచ్చునని జిల్లా ఏఎస్పీ(అడ్మిన్) ఏవీ సుబ్బరాజు అన్నారు. ఆదివారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అండర్- 20 రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌ను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. మన దేశం సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నప్పటికీ క్రీడల్లో కొంత లోటు కనబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యువ క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో క్రీడల్లో రాణించాలని స్పష్టం చేశారు. తాను క్రీడాకారుడు కావడం వల్లనే స్పోర్ట్స్ కోటాలో ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ కోర్సులో సీట్ సంపాదించుకోగలిగానని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ తమ కళాశాల క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్ మాట్లాడుతూ స్పోర్ట్స్ కోటాలో ఫెన్సింగ్ క్రీడకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అందువల్లే గత ఏడాది ఐఐటీ, ఎన్ఐటీలలో ఫెన్సింగ్ విద్యార్థులు అధిక సీట్లు పొందగలిగారన్నారు. పోటీల్లో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 314 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు కృష్ణమోహన్ వివరించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్, ఫెన్సింగ్ స్టేట్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సత్యనారాయణరాజు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత రెండేళ్లుగా కళాశాల ప్రాంగణంలో రాష్ట్రస్థాయిలో అనేక పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు, ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చల్లా రాము, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ సీహెచ్ హరిమోహన్, జి.సారిక, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

మంగమ్మతల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు


గుబ్బల మంగమ్మ తల్లి దర్శనానికి వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: బుట్టాయిగూడెం మండలం మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మ తల్లిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గత రెండు రోజులుగా ఈ ప్రాంతంలో ఏదో సమయంలో వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులను మంగమ్మతల్లి దర్శనానికి ఆలయ కమిటీవారు అనుమతించారు. దీంతో పెద్ద ఎత్తున తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రైవేటు బస్సులు, మినీ వ్యాన్‌లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

అక్రమ మద్యం పట్టివేత


తాటాకులగూడెం చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్న మద్యం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద ఆదివారం ఎస్ఈబీ అధికారులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో తెలంగాణ నుంచి ఆంధ్రా వైపు అక్రమంగా తరలిస్తున్న 30 బ్రాందీ సీసాలను ఆదివారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్ఈబీ ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు. వాహనాల తనిఖీ సమయంలో బజాజ్ ఆటో మాక్సిమా ఆటోపై అనుమానం వచ్చి పూర్తి స్థాయిలో తనిఖీ చేయగా 30 బాటిల్స్ గుర్తించామన్నారు. వాటిని స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆటోను సీజ్ చేసి.. బాబూరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. తదుపరి విచారణ కోసం జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ కార్యాలయానికి తరలించామన్నారు.

ఆలస్యమైతే వెదజల్లే పద్ధతి మేలు




మెట్ట ప్రాంతం సమ్మెటవారి గూడెంలో విత్తనాలు వెదజల్లుతున్న రైతు

చింతలపూడి: ఇటీవల వరి సాగులో ఖర్చులు బాగా పెరిగాయి. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ఏటా సకాలంలో వరినాట్లు పడటం లేదు. పోసిన నారు ముదిరిపోవడం, లేదా నారు దెబ్బతినడంతో దిగుబడులు తగ్గుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సాగు ఖర్చును తగ్గించుకుని, కూలీల సమస్యను అధిగమించేందుకు దమ్ము చేసిన పొలంలో నేరుగా వరి విత్తే పద్ధతిని ఆచరించడం మేలని చింతలపూడి వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగకుమార్ సూచిస్తున్నారు.

రైతుకు లాభం

దమ్ము చేసిన పొలంలో నేరుగా వరి విత్తడం వల్ల నారు పోయడం, నారు తీత, నాట్లు వేసే పని ఉండదు. ఈ విధానం వల్ల ఎకరాకు రైతులకు సుమారు రూ.4,000 ఖర్చు తగ్గుతుంది. ఎకరాకు 15-20 కిలోల విత్తనం ఆదా అవుతుంది. మొక్కల మధ్య సాంద్రత ఉండటంతో ఎకరాకు 15 శాతం దిగుబడి పెరుగుతుంది. ఎక్కువ విస్తీర్ణంలో నాటుకోవడం మాత్రమేకాక , వారం పది రోజుల ముందుగానే పంట కోతకు వస్తుంది.

సాగులో మెలకువలు

సాధారణంగా అన్ని రకాల నేలల్లో దమ్ము చేసి వరి విత్తే పద్ధతిని అవలంబించవచ్చు. చౌడు, ఆమ్ల, క్షార నేలలు మాత్రం ఈ విధానానికి అనుకూలం కావు. రకాన్ని బట్టి ఎకరాకు 10 నుంచి 15 కిలోల విత్తనం అవసరం అవుతుంది. వరిసాగు ఆలస్యమయ్యే పరిస్థితుల్లో స్వల్పకాలిక వరి విత్తనాలను ఎంచుకోవడం మేలు. విత్తనాలను 24 గంటలు నానబెట్టి, మరో 24 గంటలు మండెకట్టి దమ్ము చేసిన పొలంలో వెదజల్లడం కాని, డ్రమ్ము సీడర్‌తో కాని విత్తుకోవాలి. సాధారణ పద్ధతిలో వరి నాటేందుకు తయారు చేసుకునే విధంగానే దమ్ము చేసుకోవాలి. పొలాన్ని చిన్న మడులుగా చేసుకుని నీరు పెట్టడానికి, ఎక్కువైన నీరు తీసుకోవడానికి వీలుగా ఏర్పాట్లు చేసుకోవాలి. విత్తే సమయంలో నీరు లేకుండా బురదలా ఉండేలా ఉండాలి.

డ్రమ్ సీడర్‌తో..

డ్రమ్ సీడర్‌తో లాగితే ఒకేసారి 8 వరుసల్లో విత్తనాలు పడతాయి. సాళ్ల మధ్య 20 సెం.మీ, మొక్కల మధ్య 5-8 సెం.మీ ఎడంగా గింజలు పడతాయి. ప్రతి 16 వరసలకు ఒక అడుగు కాలిబాట వదలాలి. ఇద్దరు కూలీలు రెండు గంటల్లో ఎకరా విత్తనాలు విత్తవచ్చు.

ఎరువుల వాడకం

సాధారణ వరికి సిఫార్సు చేసిన విధంగానే దీనికి కూడ ఎరువుల వాడకం చేపట్టాలి. దమ్ములో మాత్రం నత్రజని ఎరువులు వేయకూడదు. వేస్తే కలుపు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఎక్కువ. భాస్వరం, అరవంతు పొటాష్‌ను దమ్ములో వేసుకోవాలి. నత్రజని ఎరువులను 3 భాగాలుగా చేసుకుని విత్తిన 15-20, 40-45, 60-65 రోజులకు వేయాలి. మిగిలిన సగభాగం పొటాష్‌ను కూడ 60-65 రోజులకు నత్రజనితో పాటు వేసుకోవచ్చు.

నీటి వాడకం

విత్తిన దగ్గర నుంచి పొట్ట దశ వచ్చే వరకు బురదగా ఉంచి పొట్టదశ నుంచి పంట కోత పది రోజుల ముందు వరకు పొలంలో 2 సెం.మీ నీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి. దీనివల్ల వేరు వ్యవస్థ బాగా బలపడి పిలకలు బాగా వస్తాయి.

కలుపు నివారణ

కలుపు నివారణకు ఎకరాకు 35 గ్రాముల ఆక్సాడయార్జిల్ లేదా 400 మిల్లీ.లీ ప్రిటిక్లాక్లోర్ లేదా 100 గ్రా పైరజో సల్ఫ్యూరాన్ మందును 20 కిలోల పొడి ఇసుకతో కలిపి విత్తిన 3-5 రోజుల మధ్య పొలంలో పలుచగా నీరుంచి చల్లాలి. విత్తిన 20 రోజుల తర్వాత కలుపు సమస్య అధికంగా ఉంటే ఎకరాకు 80-100 మి.లీ బిస్‌పైరిబాక్ సోడియంను, ఊద ఎక్కువగా ఉంటే 300-400 మి.లీ సైహలోఫాప్ బ్యూటైల్‌ను , వెడల్పాటి ఆకు ఎక్కువగా ఉంటే 2, 4డి సోడియం లవణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.


బి.నాగకుమార్, వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ఏడీ

బాలిక కిడ్నాప్‌నకు యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి


బాలికను కిడ్నాప్ చేసేందుకు యత్నించిన యువకుడిని చెట్టు కట్టేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: బాలికను కిడ్నాప్ చేసేందుకు యత్నించిన యువకుడిని స్థానికులు చెట్టుకు కట్టి కొట్టి స్టేషన్‌లో అప్పగించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పేరంపేట రోడ్డులోని పోస్టాఫీసు వద్ద సుద్దాబత్తుల కృష్ణ నివశిస్తున్నాడు. కృష్ణ ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద ఉండగా, తన 8 ఏళ్ల కుమార్తె తోటి పిల్లలతో ఆరుబయట ఆడుకుంటోంది. ఆ సమయంలో ఒక వ్యక్తి పిల్లల వద్దకు వచ్చి మిఠాయిలు కొనిపెడతానని చిన్నారిని ఎత్తుకున్నాడు. ఇది గమనించిన తండ్రి కృష్ణ కేక వేసేసరికి బాలికను వదిలి ఆ వ్యక్తి పారిపోయాడు. ఇది గమనించిన చుట్టుపక్కల యువకులు అతన్ని వెంబడించి స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో పట్టుకున్నారు. చెట్టుకు కట్టేసి అతనికి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్సై మాట్లాడుతూ బాధితుల నుంచి ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామని చెప్పారు.

పెదపుల్లేరులో సైబర్ మోసం

ఉండి: ఉండి మండలం పెదపుల్లేరులో సైబర్ మోసంపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపుల్లేరు గ్రామానికి చెందిన కలిదిండి పెదరామకృష్ణంరాజుకి గుర్తు తెలియని వ్యక్తి నుంచి మార్చి నెల 28న కరెంటు బిల్లు కట్టలేదని.. కట్టకపోతే కరెంట్ కట్ చేస్తామంటూ ఓ మెస్సేజ్ వచ్చింది. దానిలో ఫోన్ నంబర్ ఉండడంతో.. కరెంట్ బిల్లు కట్టానని సదరు వ్యక్తికి ఫోన్ చేసి చెప్పాడు. మీకు ఓ లింక్ పంపుతున్నాము దానిని క్లిక్ చేస్తే తెలుస్తుందని చెప్పడంతో క్లిక్ చేశాడు. అందులో కరెంట్ బిల్లు కట్టినట్లు తెలియడం లేదని గుర్తు తెలియని వ్యక్తికి రామకృష్ణంరాజు ఫోన్ చేసి చెప్పాడు. ఓ నంబర్ పంపుతున్నాం.. దానికి రూ.5 ఫోన్ పే ద్వారా పంపితే తెలుస్తుందని చెప్పడంతో దానికి నగదు పంపించారు. అనంతరం అవతలి వ్యక్తి నుంచి ఫోన్ రాకపోవడం, ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో.. ఏం జరిగిందో తెలియని రామకృష్ణంరాజు దానిని వదిలేశారు. ఈ నెలలో బ్యాంకుకు వెళ్ళి ఖాతాను పరిశీలిస్తే మార్చి నెల 28న తన ఖాతా నుంచి రూ.1.85 లక్షలు మాయమైనట్లు గమనించి ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదుపై ఎస్సై కే.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఆన్‌లైన్ లింక్‌లు క్లిక్ చెయొద్దని అలా చేస్తే మోసాలు తప్పవని ఎస్సై తెలిపారు. ఎవరైనా అలాంటివి పంపిస్తే వెంటనే పోలీసులకు లేదా సైబర్‌క్రైం పోలీసులకు తెలియచేయాలని సూచించారు.

క్లుప్తంగా

గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెంటపాడు: చిన్నారులు దేశభక్తిని పెంపొందించుకోవాలని పెంటపాడు శాఖా గ్రంథాలయాధికారి జుల్ఫికర్ ఆలీ సూచించారు. పెంటపాడు నక్కా వెంకటేశ్వర్లు మెమోరియల్ శాఖా గ్రంథాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులకు దేశభక్తి పాటలు, దేశం లౌకికతత్వం అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ కర్రి వరహాల రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గ్రంథాలయాధికారి ఆలీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే భారతీయ సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కె.సుబ్బలక్ష్మి, కె.సందీప్‌కుమార్ వ్యవహరించారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయాధికారి తెలిపారు.

న్యాయవాదులకు చదరంగం పోటీలు



పోటీల్లో పాల్గొన్న న్యాయవాదులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం పట్టణ న్యాయవాదుల బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులకు చదరంగం పోటీలు నిర్వహించారు. రెండు రౌండ్‌లు జరిగిన పోటీలు ఆసక్తికరంగా సాగాయి. అనంతరం షటిల్, బ్యాడ్మింటన్ పోటీలు తాలూకా ఆఫీస్ సెంటర్‌లోని ఇండోర్ ప్రాంగణంలో నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అప్పిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.సునీల్ కుమార్ పర్యవేక్షించారు.

పారుపల్లి అమ్మవారికి సారె సమర్పణ



పారుపల్లి అమ్మవారు

పెంటపాడు: జట్లపాలెం గ్రామ దేవత పారుపల్లి అమ్మవారికి ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో సారె, చలిమిడి పానకాలు, చీరెలు సమర్పించారు. శ్రావణ మాసం పురస్కరించుకుని గ్రామ శివాలయం నుండి బాణసంచా, కోలాటం, తీన్మార్ డప్పులు, గరగ నృత్యాలు, సన్నాయి మేళాలతో కోలాహలంగా అమ్మవారి ఆలయానికి వెళ్లి సారె, చీరెలు సమర్పించారు. పూరిగుడిసె వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ఆడపడుచులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు టీచర్స్ కాలనీలో జెండా పండుగ

పెంటపాడు: జీసెస్ బిలీవర్ యూనియన్(జేబీయూ), గూడెం లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 15వ తేదీ మంగళవారం కొండాయి చెరువు టీచర్స్ కాలనీలో జెండా వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేబీయూ అధ్యక్షుడు మానుకొండ డల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, కాలనీ పెద్దలు, చిన్నారులు, చర్చి సంఘ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం కృషి చేయాలి

కాళ్ల: అంబేడ్కర్ ఆశయాలసాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ పేర్కొన్నారు. సీసలి గ్రీన్ వ్యూ ఇంటరనేషనల్ ఫంక్షన్ హాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బాహుజన సమాఖ్య సంఘం 2వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఫౌండర్ సోడదాసి గంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేడ్కర్ అయన అడుగుజాడల్లో నడుస్తామన్నారు. ఆయన ఆశయాన్ని కొనసాగించేందుకు ఈసమైక్యకృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉండి, ఆకివీడు, పాలకోడేరు ,కాళ్ల మండలాల్లో పదోతరగతి ఉత్తీర్ణతలో మండలం ఫస్ట్ సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను ఒక్కొక్కరికీ రూ.5 వేల నగదును డీఈఓ చేతులమీదుగా అందజేసి సత్కరించారు.

మణిపూర్ ఘటన పునరావృతం కారాదు



వల్లూరుపల్లిలో అంజలి ఘటిస్తున్న జాయ్‌బాబు, సంఘ సభ్యులు



అత్తిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐక్య పాస్టర్ల సంఘ సభ్యులు

పెంటపాడు: దేశంలో మణిపూర్ వంటి ఘటన పునరావృతం కాకూడదని కోరుతూ ఆదివారం వల్లూరుపల్లి ప్రార్థనా కేంద్రంలో కొవ్వొత్తులతో మౌనం పాటించారు. కార్యక్రమానికి నాయకత్వం వహించిన గ్రామ మాజీ సర్పంచ్, జాయ్ సంస్థ అధ్యక్షుడు మల్లిపూడి జాయ్‌బాబు మాట్లాడుతూ దేశంలో గత మూడు నెలలుగా వెలుగులోకి రాకుండా మతం, తెగల పేరిట మారణ హోమం చేయడం విచారకరమన్నారు. రెండు తెగల మధ్య ఏర్పడిన విభేదం దేశాన్ని కుదిపేసిందన్నారు. దేశం తలదించుకునే ఈ ఘటన పునరావృతం కాకుండా కేంద్రం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రార్థనా కేంద్రం నిర్వాహకురాలు మల్లిపూడి జమాయమ్మ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జాలాది చిట్టి ముత్యాలు, మార్లపూడి వీరేంద్రనాథ్, బాదంపూడి శ్యాంబాబు, పల్లేటి గంగరాజు, మార్లపూడి ఎలీషా, సండే స్కూలు టీచర్ కండెల్లి ప్రశాంతి, సిర్రా రావమ్మ, కె.సత్యవతి, డాక్టర్ ఎం.జెస్సీకా పాల్గొన్నారు.



వేల్పూరులో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

అత్తిలిలో..

అత్తిలి: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన మారణ కాండ, అత్యాచార సంఘటనలను నిరసిస్తూ అత్తిలి మండల ఐక్య పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అత్తిలిలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి క్రైస్తవులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మత స్వేచ్ఛను కాపాడాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాలని కోరారు. మణిపూర్ వంటి ఘటనలు ఎక్కడా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. భారత్ లౌకిక దేశమని చాటి చెప్పాలన్నారు. బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ అత్తిలి పురవీధుల్లో శాంతి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో యూపీఏ సంఘ అధ్యక్షుడు వై.బాబూరావు, కార్యదర్శి కె.శేఖర్‌బాబు, కోశాధికారి పి.సంపతరావు, సహాయ కార్యదర్శి పి.శామ్యూల్, కె.మల్యాద్రి, గొల్లపల్లి అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరులో..

తణుకు టౌన్: దేశంలో మణిపూర్, ఇతర ప్రాంతాల్లోని భారతీయ క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా తణుకు రూరల్ మండలం వేల్పూరులో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం గ్రామంలోని అన్ని చర్చిల కు సంబంధించిన పాస్టర్లు, విశ్వాసులు, సంఘ పెద్దలు ప్రధాన వీధుల్లో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. బ్యానర్‌లతో ప్రదర్శన చేసి నినాదాలు చేశారు. దేశంలోని చర్చిలు, క్రైస్తవులకు రక్షణ కల్పించాలని, విధ్వంసాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కాపు యువత సేవా కార్యక్రమాలు



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో కాపు యువత, మారిశెట్టి అజయ్‌బాబు యువసేన, మామిడాల తోట యూత్, సవిత్రుపేట యూత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పడాల వృద్ధాశ్రమంలో అన్నదానం, గాంధీ బొమ్మ సెంటర్‌లో యాచకులకు దుప్పట్లు పంపిణీ, అన్నదానం, ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ, అన్నా క్యాంటీన్ వద్ద అన్నసమారాధన, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మారిశెట్టి సుబ్బారావు, మాజీ కౌన్సిలర్ అమలాపురపు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విజ్ఞాపన ప్రార్థన

పెంటపాడు: స్వతంత్ర్య భారత దేశం క్షేమంతో పాటు, మణిపూర్ అల్లర్లు సద్దుమణగాలని కాంక్షిస్తూ సోమవారం తాడేపల్లిగూడెం భాగ్యలక్ష్మీపేట ఎల్ఎల్ఎం చర్చిలో ప్రత్యేక విజ్ఞాపన ప్రార్థన చేయనున్నట్లు యునైటెడ్ పాస్టర్ల ఫెలోషిప్ సంఘ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ ప్రార్థనలో గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు, పెంటపాడు, గణవరం మండలాల్లోని పాస్టర్లు, సంఘ ప్రతినిధులు విధిగా పాల్గొనాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తణుకు టౌన్: తణుకులోని రవీంద్ర ఐటీఐలో 1981–83 సంవత్సరాల్లో ఐటీఐ డ్రాఫ్ట్‌మెన్ సివిల్ కోర్సు చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. సుమారు 40 సంవత్సరాల క్రితం ఐటీఐ చదివి వివిధ ఉద్యోగ, వ్యాపార, వృత్తుల్లో స్థిరపడిన వారు కుటుంబ సమేతంగా తణుకులోని చిట్టూరి హెరిటేజ్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించి కలుసుకున్నారు. సమావేశంలో 19 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని అప్పటి గురువులను సత్కరించారు. కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న అన్నవరం సూర్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం) నూతన కమిటీ జిల్లా అధ్యక్షునిగా చెరుకూరి దుర్గాప్రసాద్ ఎన్నికయ్యారు. తాడేపల్లిగూడెం ఎన్‌జీఓ హోంలో యూనియన్ జిల్లా ముఖ్యులతో సమావేశం జరిగింది. తణుకు, తాడేపల్లిగూడెం, ఆకివీడు, భీమవరం, పాలకొల్లు, నరసాపురం సంఘాలనుంచి ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా నూతన కమిటీకి గౌరవాధ్యక్షునిగా కేవీవీ మోహన్, ఉపాధ్యక్షులుగా మానెం బసవరాజు, బండి దుర్గాప్రసాద్, సెక్రటరీగా నల్లా శివకుమార్, జాయింట్ సెక్రటరీగా కట్టోజు భాస్కర్, కోశాధికారిగా జమితార చంద్రశేఖర్, గౌరవ సలహాదారునిగా పామర్తి అన్నవరం సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా పాలా రామకృష్ణారావు, కొల్లి బ్రహ్మాజీ నాయుడు, బత్తుల నాగేశ్వరరావు, జి.కేదారేశ్వరుడు, దేవాబత్తుల రాంబాబు, మేకా ఆదినారాయణ, ఎంఎస్‌వీ ఆచార్యులు, కె.లాల్ బహుదూర్ శాస్త్రి, గుబ్బాల శ్రీను, పి.కిరణ్‌బాబు, హరినాథ్‌బాబు, సోమేమేశ్వరరావు ఎన్నికయ్యారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు మునగాల జితేంద్ర



కార్యదర్శి కొల్లి రాజశేఖర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని తాళ్ల ముదునూరుపాడులో డాక్టర్ పీఎస్ మూర్తి మెమోరియల్ పీఎంపీ సేవా సదన్‌లో ఆదివారం కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (సీపీ అండ్ పీహెచ్‌పీ) వెల్ఫేర్ అసోసియేషన్ తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షునిగా మునగాల జితేంద్ర, కార్యదర్శిగా కొల్లి రాజశేఖర్, కోశాధికారిగా కొడిసి రమేష్, ఉపాధ్యక్షులుగా జేవీ త్రినాథ్, సహాయ కార్యదర్శిగా గుర్రాల దుర్గారావు, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు నూతన కార్యవర్గంతో ప్రతిజ్ఞ చేయించారు. నూతన అధ్యక్షుడు జితేంద్ర మాట్లాడుతూ అసోసియేషన్ ఉన్నతికి, ప్రజల్లో వ్యాధుల పట్ల అవగాహన కల్పించడంతో పాటు నివారణ చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. డాక్టర్ ఎం.రాజ్‌పాల్ వైద్య విజ్ఞాన తరగతులు నిర్వహించారు. మండల గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, పీఎంపీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయం



కోపల్లె హైస్కూల్లో మొక్క నాటుతున్న దృశ్యం

కాళ్ల: తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమానికి డీఈఓ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. దీనిలో భాగంగా పూర్వ విద్యార్థి, ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్ వీఎస్ రాజు ప్రోత్సాహంతో ఏర్పాటు చేసిన సుమారు 1000 మొక్కలను పాఠశాల ఆవరణలో ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు నాటారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో డీఈఓ వెంకటరమణ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులంతా ఒక కమిటీగా ఏర్పడి సుమారు రెండు కోట్ల నిధిని సేకరించి పనులు చేపట్టటం శుభపరిణామమన్నారు. తొలుత పాఠశాల ఆవరణ అంతా పచ్చదనంతో సుందరీకరణ చేయటానికి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం సంతోషదాయకమన్నారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని సైతం పునర్నిర్మాణం కోసం అవసరమైతే నిధులు అందిస్తామని చెప్పటం అభినందనీయమన్నారు. దీనిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన పాఠశాలల్లో కూడా వాటి అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖ తరఫున ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా సహకరిస్తామన్నారు. ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్ వీఎస్ రాజు మాట్లాడుతూ చదువుకు మించిన జ్ఞానం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఉప సర్పంచ్ బూడి వెంకటపరాలు, ఎంఈఓ కనకరాజు, మంతెన రామకుమార్ రాజు, డాక్టర్ రామకృష్ణంరాజు, డాక్టర్ గోపాలరాజు, ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాజు, పూర్వ విద్యార్థులు కొత్తపల్లి బంగారాజు, అభిరుచి కాశీ, పుల్లంరాజు, సిహెచ్ వెంకట్రావు, మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

10 మంది వృద్ధులకు వైద్యసేవలు

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే సంచార వైద్యశాల ద్వారా 10 మంది వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు పట్టణం, గ్రామాల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని 10 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. సంఘ సభ్యుడు, పైడిపర్రుకు చెందిన దాత అనుమోలు సుబ్బారావు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవతను బలోపేతం చేద్దాం

● కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు

పెంటపాడు: జిల్లాలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థలను బలోపేతం చేసేందుకు సభ్యుల సమిష్టి కృషి ఎంతో అవసరమని మానవత కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. మానవత జిల్లా సమావేశం పెంటపాడులో ఆదివారం సాయంత్రం విశ్రాంత ఆంధ్రా బ్యాంక్ చైర్మన్, మానవత జిల్లా నూతన చైర్మన్ తాడేపల్లి మోహనరావు అధ్యక్షతన ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలోని పలు అంశాలపై చర్చించారు. ప్రతి మండలంలో కనీసం 500 మందికి సభ్యత్వం అందించేలా, మానవత లేని మండలంలో నూతనంగా సేవలు ప్రారంభించేలా ఏర్పాట్లు, ఈనెల 21లోపు మానవత వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీలు, ప్రత్యేక సదస్సులు నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో మానవత జిల్లా అధ్యక్షుడు కేఎస్ఎన్ మూర్తి, నూతన జిల్లా కమిటీ సభ్యులతో పాటు, పలు మండలాలకు చెందిన మానవత కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

వీరవాసరం: పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ (రైల్వే) జనరల్ మేనేజర్ కాయల వెంకటరావు అన్నారు. నేలపోగుల గ్రామంలో ప్రగతి భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ చేపట్టాలని పిలుపునిచ్చారు. ట్రస్ట్ వైస్ చైర్‌పర్సన్ కాయల సునీత, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు భాషను రక్షించుకోవాలి

ఆంధ్ర సారస్వత పరిషత్ చైర్మన్ గజల్ శ్రీనివాస్



తణుకులో రసరాజు గ్రంథావళిని ఆవిష్కరిస్తున్న గజల్ శ్రీనివాస్ తదితరులు

తణుకు: తెలుగు భాష కనుమరుగు కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆంధ్ర సారస్వత పరిషత్ చైర్మన్ గజల్ శ్రీనివాస్ అన్నారు. తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత రసరాజు రచించిన మూడు గ్రంథాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన స్థానిక రామకృష్ణ సేవా సమితి ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ అధికార భాష తెలుగు అయినప్పటికీ ప్రజలకు మమకారంగా ఉన్న తెలుగును కాపాడుకోవాలన్నారు. రసరాజు కవిత్వం రాయరని.. ఆయన చేత కవిత్వం రాయించుకుంటుందని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మల్లిన రామచంద్రరావు, వైద్యులు తాతిన రామబ్రహ్మం, వత్సవాయి వెంకట్రాజు, రచయితలు ఎర్రాప్రగడ రామకృష్ణ, భారతం శ్రీమన్నారాయణ, సుశర్మ, కోసూరి గాంధీ, రసరాజు, అక్కిపెద్ది రామసూర్యనారాయణ, కొల్లి రామచంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు క్యాంటీన్ ప్రారంభం



భీమవరంలో పోలీసు క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ సతీమణి కోమలి, చిత్రంలో ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం సమీపంలోని క్వార్టర్స్ వద్ద పోలీసుల కోసం ప్రత్యేకంగా సబ్సిడీ క్యాంటీన్‌ను ఆదివారం జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ సతీమణి కోమలి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ రవిప్రకాష్ మాట్లాడుతూ పోలీసు కుటుంబాల కోసం తక్కువ ధరలో నిత్యావసర వస్తువులు అందించే లక్ష్యంతో క్యాంటీన్ ప్రారంభించామన్నారు. ఇక్కడ పోలీస్ డిపార్ట్‌మెంట్‌ను హోంగార్డు నుంచి పైస్థాయి అధికారుల వరకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నా భూమి – నాదేశం కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ కార్యాలయం ఆవరణలో ఎస్పీ రవిప్రకాష్, కోమలి దంపతులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీలు (అడ్మిన్) ఏవీ సుబ్బరాజు, ఏటీవీ రవికుమార్ (సెబ్), డీఎస్పీ బండారు శ్రీనాథ్, ఏఆర్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, భీమవరం వన్ టౌన్, టుటౌన్, రూరల్ సీఐలు అడబాల శ్రీను, జి.శ్రీనివాస్, నాగప్రసాద్, రిజర్వ్ సీఐ శ్రీకాంత్, వెంకట్రావు పాల్గొన్నారు.

'భైట్' కళాశాలకు నాక్–ఎ గుర్తింపు



భైట్ కళాశాలలో విలేకరులతో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీవెంకటేశ్వరరావు

సాక్షి, భీమవరం: భీమవరం ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (భైట్) కళాశాలకు నాక్–ఎ గ్రేడ్ గుర్తింపు లభించిందని కళాశాల చైర్మన్ ఎ.శ్రీవెంకటేశ్వరరావు చెప్పారు. కళాశాలలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గత నెల 26, 27 తేదీల్లో నాక్ టీమ్ కళాశాలను సందర్శించి విద్య ప్రమాణాలు, ల్యాబ్ వంటి సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి చెందడంతో నాక్–ఎ గ్రేడ్ గుర్తింపు లభించిందన్నారు. 2007లో స్థాపించిన భైట్ కళాశాల ఏఐసీటీఈ, జెఎన్‌టీయూకే గైడెన్స్ ప్రకారం ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన చేస్తూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నామన్నారు. ఏటా 80 శాతం మంది విద్యార్థులకు ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉద్యోగాలు పొందేలా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు తగిన శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వైస్ చైర్మన్ టీవీవీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సురేష్ మాట్లాడుతూ నాక్–ఎ గ్రేడ్‌కు ఐదేళ్ల కాలపరిమితి ఉంటుందన్నారు. చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఈశా గ్రామోత్సవాలు

పాలకోడేరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన గ్రామోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వాలీబాల్ పురుషుల విభాగంలో ఆరవల్లి, కోపల్లె మధ్య జరిగిన ఫైనల్ పోరు హోరాహోరీగా సాగింది. 2-0 తేడాతో ఆరవల్లి జట్టు విజేతగా నిలబడగా, కోపల్లె రన్నర్‌గా నిలిచింది. మహిళల త్రోబాల్ పోటీల్లో విజేతగా బొండాడ నిలిచింది.

బీజేపీ నియోజకవర్గ సమావేశం



మాట్లాడుతున్న తాతాజీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కిరాణా వర్తక సంఘ భవనంలో ఆదివారం బీజేపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట భీమాశంకరరావు (తాతాజీ) ఈనెల 14, 15వ తేదీల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులతో చర్చించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోట రాంబాబు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అయినం బాలకృష్ణ, బీజేపీ పట్టణాధ్యక్షుడు ముప్పిడి సురేష్ రెడ్డి, నియోజకవర్గ కో కన్వీనర్ రావనని సత్యనారాయణ, జిల్లా ఇంటలెక్చువల్ సెల్ కన్వీనర్ చిట్యాల రాంబాబు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెదప్రోలు వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

తేతలిలో మరో నామినేషన్ ఉపసంహరణ

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామ పంచాయతీ 8వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి దాఖలైన నామినేషన్లలో ఆదివారం మరో నామినేషన్ ఉపసంహరించుకున్నట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఆదివారం తేతలి 8వ వార్డు సభ్యుని పదవికి నామినేషన్ దాఖలు చేసిన వీరవల్లి సత్యనారాయణ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో పోటీలో ఇద్దరు మాత్రమే మిగిలి ఉన్నారు. పోటీ ముఖాముఖీగానే జరిగే అవకాశాలున్నాయి.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడేపల్లిగూడెం: 90102 23729, 90100 68395, 63097 62918
తణుకు: 90108 43311, 90100 51493
Office mail : tpgadvt@gmail.com